ఈ తప్పు క్షమించలేను!

వసుంధర

అలారం గణగణ మ్రోగింది.

నాకు మెలకువ వచ్చింది. మంచంమీద నుంచి లేవ బోయాను.

కానీ రాధ నన్ను కరిచిపెట్టుకుని పడుకుని ఉంది. అలారం చప్పుడు వినగానే ఆమె నా చుట్టూ తన బంధాన్ని మరింత బిగించింది.

నేను మృదువుగా ఆమె చేతుల్ని విడిపించుకో బోయాను.

"అప్పుడే లేవద్దు—...." ముద్దుగా, గారంగా అంది రాధ. ఆమె కనులు మాత్రం యింకా మూతబడే ఉన్నాయి.

"టైము యేడున్నరయింది—తెలుసా?" అన్నాను.

"రాత్రి మీరు వచ్చేసరికి పన్నెండున్నర దాటింది—గుర్తుందా?" అంది రాధ. ఇంకా ఆమె కళ్ళు తెరవ లేదు.

నేను తడబడి—"అయితే?" అన్నాను.

"మీ రాలస్యంగా యెందుకొచ్చేరూ అనడంగడం లేదు నేను. కనీసం ఎనిమిదిగంటల సేపయినా కలిసి మంచం మీద పడుకుందామంటున్నాను...." అంది రాధ.

"అయితే?"

"రాత్రి మనం పడుకునేసరికి ఒంటిగంటయింది. తొమ్మిదిదాకా మనం నిద్ర లేవక్కర్లేదు—...."

"అయితే నువ్వు పడుకో...."

"మీరు వెళ్ళిపోతే నాకు నిద్రపట్టదు...." ముద్దుగానే అంది రాధ.

"నీకేమో ఒకటే నిద్ర. నాకేమో నిద్రపట్టదు...." నేనింకా యేదో అనబోతుండగా—"మీకు మాత్రం నిద్రెందుకు పట్టదు? మీరూ నాతోపాటే కదా నిద్ర పోయింది...." అని యెదురు ప్రశ్న వేసింది రాధ.

"నాకు నిద్ర తక్కువ—" అన్నాను.

చటుక్కున లేచి కూర్చుంది రాధ. ఆమె కళ్ళలో మత్తు పూర్తిగా విడిపోయింది—"నాకూ నిద్ర తక్కువే! మీరు ఆఫీసులో నిద్రపోతారు, సినిమా హాల్లో నిద్ర పోతారు. నేను మీరు పక్క నున్నప్పుడు మాత్రమే నిద్రపోతాను."

"నేను ఆఫీసులో నిద్ర పోతానని నీ కెవరు చెప్పారు?"

"మా నాన్న!"

కోపాన్ని పళ్ళ బిగువున అపుకున్నాను. రాధ తండ్రి రామమోహనరావు ఆ ఫీసులో, అంతస్తులో నా కంటే ఎన్నో రెట్లు గొప్పవాడు. ఇప్పుడు నాకున్న ఆ స్థి,

అంతస్థు కూడా ఆయనవల్లే వచ్చాయి. నే నుంటున్న యిల్లు ఆయనది. నేను చేస్తున్న ఉద్యోగం ఆయ నిప్పించినది. ఆయనకు నామీద అట్టే సదభిప్రాయం లేదు.

రాధ నన్ను ప్రేమించింది. రాధ ప్రేమ నాయన ఆమోదించాడు. మాకు పెళ్ళి జరిగింది.

ఆయనకు రాధ ఒక్కతే కూతురుకాదు. రాధకు ముందు ఇద్దరు. రాధ తర్వాత ఒకరు వున్నారు. ఆయన పెద్దల్లుళ్ళిద్దరూ అన్నివిధాలా ఆయనకు తగినవాళ్ళు. నేనూ వాళ్ళకులా వుండాలని, ఆ ఎత్తుకు ఎదగాలని ఆయన అభిలాష. అయితే నాకు నేను చేస్తున్న ఉద్యోగమే ఎంతో తృప్తిగా వుంది. నాకు పెద్దగా కోరికలేమీ లేవు. చేతిలో డబ్బుంది. చక్కటి ఇల్లుంది. ఇంతకంటే ఎందుకూ అనిపిస్తుంది.

"ఇదే సంతృప్తి అన్ని రంగాల్లోనూ వుంటే నిన్ను చేసుకున్నందుకు రాధంత అదృష్టవంతురా లుండదు—" అంటాడు రామమోహనరావు. కానీ నేనంటే ఆయనకేదో అసంతృప్తి వుంది. అది చూచాయగా నేనూ అర్థంచేసుకోగలను.

ఆయన నా గురించి రాధ దగ్గర వేళాకోళంగా మాట్లాడుతూంటాడని ఇప్పుడర్థమయింది నాకు. నేను రాధవంక చూశాను. ఆమె పళ్ళ బిగువున నవ్వుకుంటోంది.

"నువ్వు మీ నాన్న మాటలు నమ్మావా?" అన్నాను.

"నిజం చెబితే నమ్మనా?" రాధ తమాషాగా నవ్వింది. ఆ నవ్వులో అమాయకత్వం వుంది. అది నిజంగా అమాయకత్వం కాదు. అందం ఆమెకిచ్చిన వరం ఆ అమాయకత్వం. అందుకే ఆ అమాయకత్వం నన్ను కవ్విస్తుంది.

నేనామె చుబుకం పై ముద్దు పెట్టుకొని—"నా గురించి

నీకీ ఆరాలన్నీ ఎందుకు?" అన్నాను.

"ఇందులో ఆరా ఏముంది? నాన్న చెబితే విన్నాను. మీరు ఆఫీసులో నిద్రపోతున్నారంటే నాకు సంతోషం కూడా కలిగింది—" అంది రాధ.

"ఎందుకు?"

"ఇంట్లో మీరెప్పుడూ పట్టుమని ఆరేడు గంటలు కూడా నిద్రపోరు. మీకు నిద్ర చాలదని నా భయం. నిద్ర తక్కువైతే బ్లడ్ ప్రెషర్ పెరుగుతుందిట. ఆరోగ్యం చెడిపోతుందిట...." అంది రాధ. మళ్ళీ అదే అమాయకత్వం ఆమె ముఖంలో.

నన్ను నేను నిగ్రహించుకొని—"ఆఫీసులో నేనేం చేస్తూంటానూ అని ఆరాతీస్తున్నావన్న మాట. అది నాకు సంతోషంగా లేదు—" అన్నాను.

"అందులో నేను తీసిన ఆరా ఏమీ లేదు. ఆరా అంటే రాత్రి మీరు పన్నెండున్నరకొచ్చారూ—అప్పుడు ఎందుకొచ్చారూ అని నిలదీయడం!" అంది రాధ.

నేను తడబడి-"నిలదీయలేకపోయావా?" అన్నాను.

"అలాంటివి నా కసహ్యం. నేను మిమ్మల్ని నమ్ముతున్నాను. ఆలస్యంగా వచ్చినప్పుడు కారణం చెప్పడం మీ బాధ్యత. చెప్పలేదంటే అది నేను తెలుసుకోతగ్గ ముఖ్య విశేషం కాదన్నమాట...." అంది రాధ.

నేనుండబట్టలేక-"ఒకవేళ అది నీకు ముఖ్య విశేషమే అయి—నీనుంచి రహస్యంగా వుంచుతున్నాననుకో—అప్పుడు!" అన్నాను.

"మీరు నా నుంచి రహస్యం దాచినా, అబద్ధం చెప్పినా అందులో నా తప్పు కొంత వుంటుంది...." అంది రాధ—"మీకు నా గురించి పూర్తిగా అర్థం కాలే

దన్న మాట. అర్థమైతే నా నుంచి రహస్యం దాచరు. నాకు అబద్ధం చెప్పరు...."

"ఎందుకని?"

"నాకు పరిస్థితులపట్ల పూర్తి అవగాహన వుంది. మా నాన్న మాలో విశాల భావాలు నూరిపోశాడు. తప్పు చేస్తే సానుభూతితో అర్థం చేసుకోగలను. తప్పుచేసిన మనిషి పశ్చాత్తాపపడితే క్షమించగలను. ఎందుకంటే తప్పు చేయడం మానవ సహజం. ఏదో బలహీనతలో ప్రతి మనిషికీ తప్పు చేయాల్సిన సందర్భం ఏర్పడుతుంది. బల హీనతను జయించినవాడు మహాత్ముడు. జయించలేనివాడు సామాన్యుడు...."

"ఇంతకీ యిదంతా నువ్వెందుకు చెబుతున్నావు?"

"ఉదాహరణకు మీ జీవితంలో నాతో వివాహానికి ముందు మరో స్త్రీ వున్నదనుకోండి. ఇప్పుడు మీ మనసులో ఆ స్త్రీకి స్థానం లేకపోతే—నేను మిమ్మల్ని మీ గతానికి తప్పుపట్టను. ఇప్పుడైతే నా పొరపాటున ఓ స్త్రీతో తప్పు చేశారనుకోండి. సవివరంగా నాకు తెలియబరిస్తే—మిమ్మల్నర్థం చేసుకుందుకు ప్రయత్నిస్తాను తప్పితే—సాధించను. అలాంటి నా దగ్గర రహస్యాలు దాచి అబద్ధాలు చెప్పే భర్తను దురదృష్టవంతుడని అనాలి.."

"నామీద నీకేదో అనుమానం కలిగింది. నిజం చెప్పించడానికే యిలా మాట్లాడుతున్నావనుకుంటాను-" అన్నాను.

రాధ నాకు దగ్గరగా జరిగి — "నేను మిమ్మల్ని ప్రేమించి పెళ్ళిచేసుకున్నాను. నా ప్రేమ నన్ను మోసం చేయదని నాకు తెలుసు. నేను మిమ్మల్ని పూర్తిగా నమ్ముతున్నాను. మీరూ నన్ను నమ్మండి—" అంది.

ఆమె నన్ను ప్రేమిస్తున్నదని నాకూ తెలుసు. అందుకే ఆమెను నమ్మి నిజం చెప్పడం కష్టం!

2

"ఇప్పుడు టైము పది దాటింది. తెలుసా?" అంది రోజా.

"అన్నటైముకు రావాలనే అనుకున్నాను. కానీ రాధ వదలాలికదా—" అన్నాను.

"మర్చిపోయాను. నీకు పెళ్ళయిందికదూ!" అని నిట్టూర్చింది రోజా — "నువ్వు ఆమెను వదిలి రాలేకపోయా వేమోనని నా అనుమానం—"

ఆమె అనుమానానికి నేను నవ్వి ఊరుకున్నాను. మగాడికి భార్య అందుబాటులోని వస్తువు. పరాయి ఆడదానికోసం తపించినట్లు మగాడు భార్యకోసం తపించడు. ఆ విషయం రోజాకూ తెలుసు. కానీ ఇప్పుడామె అలా ఎందుకన్నదంటే— నేను తనను రాధతో పోల్చి ఎక్కువ చేయాలి....అది ప్రస్తుతం నా కిష్టంలేదు. మా యిద్దరి మధ్యా రాధ ప్రసక్తి రావడం నాకిష్టం లేదు.

రాధ అందమైనది. నన్ను ప్రేమించింది. మీదు మిక్కిలి ఆమె మనసు మంచిది. పనిగట్టుకుని ఆమెను చిన్నబుచ్చడ మెందుకు?

అలాగని రోజాను నిరుత్సాహపర్చలేను.

కాలేజీ రోజుల్లో రోజా, నేను ప్రేమించుకున్నాం. అరమరికలు లేకుండా కలిసి తిరిగాం. అవి నాకు మధురానుభూతులు.

రోజా చాలా తెలివైనది. మేము విచ్చలవిడిగా నే తిరిగినప్పటికీ మా పరిచయం గురించి ఎందరికో తెలియదు.

ఆమెకు నేనుకాక యింకా మగ స్నేహితులున్నారని నా అనుమానం. కానీ ఎక్కడా రోజా నాకు దొరకలేదు.

కాలేజీ చదువు పూర్తికాకుండా నే రోజాకు పెళ్ళయి పోయింది. అప్పుడుకూడా ఆమె నాతో—"నీకూ నాకూ పెళ్ళి కుదరదు. నీకంటే వయసులో, ఆస్తిలో, అంతస్తులో పెద్దవాణ్ని మాత్రమే నేను పెళ్ళిచేసుకుంటాను. కానీ నిన్ను నేను మరిచిపోలేను. నీకోసం మళ్ళీ ఎప్పుడైనా వస్తాను. మళ్ళీ ఈ రోజులప్పుడు గుర్తు తేవాలి—" అంది.

ఆమె ఇప్పుడు నాకోసం వచ్చింది. భర్త ఫారిన్ వెళ్ళాడు. పిల్లలు బోర్డింగ్ స్కూల్లో వున్నారు. తను నాకోసం ఈ ఊరొచ్చింది. ఎంతో తెగించి ఈ ఊరొచ్చింది. ఆమెది కూడా ప్రేమే కదా! ఆమెను మాత్రం నే నెలా నిరుత్సాహపర్చగలను?

"అప్పటికీ యిప్పటికీ నీలో యే మార్పూ లేదు—" అన్నాను. రాధ ప్రసక్తి తీసుకురావడం యిష్టంలేక నేనామాట అనలేదు. నేనన్నమాటలో నిజముంది.

రోజా గర్వంగా—"ఈ ప్రపంచంలో అన్నింటికీ మించి నేను నా శరీరాన్ని ప్రేమిస్తున్నాను. దీనికోసం నే నేమైనా త్యాగం చేయగలను. ఈ శరీరాన్నిలా వుంచడంకోసం రోజూ నేను వ్యాయామం చేస్తున్నాను. తిండి బాగా తగ్గించడమేకాక ఇష్టమైన పదార్థాలెన్నో తినడం మానేశాను—" అంది.

"పోనీలే — నామీద ఇష్టానుంచుకున్నావు...." అన్నాను.

"నీమీద ఇష్టమెలా పోతుంది? యూ ఆర్ మై ఫస్ట్ లవ్!" అందామె.

నేనామెను దగ్గరగా తీసుకున్నాను. రోజా నా కౌగిలిలో ఒదిగిపోతూ—"నీ స్పర్శలో ఏదో ప్రత్యేకత వుంది. నా శరీరమంతా నరనరాలా విద్యుత్తు ప్రవహించినట్లుంది." అంది.

అదే అనుభూతి నాకూ కలిగింది. అది మాలోని ప్రత్యేకత కాదు. తప్పుచేయడంలోని థ్రిల్!

రాధకు డబ్బుంది. నామీద ప్రేముంది. అన్నింటికీ మించి నాపైన నమ్మకముంది. నేనామె నమ్మకాన్ని వమ్ము చేస్తున్నాను.

ఇదామెకు తెలిస్తే ఏమవుతుంది?

ఎలాంటి తప్పునైనా తనకు చెబితే క్షమించగలనందామె. నేనామెకు చెప్పడంలేదు. ఎందుకంటే నాకామెపై నమ్మకం లేదు.

"మళ్ళీ పాతరోజులు గుర్తొస్తున్నాయి—" అంది రోజా. ఆమె కళ్ళలో మెరుపు. ఆమెకవి మధురానుభూతులు.

నాకు రవంత గర్వం కలిగింది. నాలో ఏదో ప్రత్యేకత వుంది. నా తొలి ప్రియురాలు రోజా ఇప్పటికీ నన్ను గుర్తుంచుకుని నాకోసం వచ్చింది. నా భార్య రాధ నన్ను మనసారా ప్రేమించి నమ్ముతోంది ఇంకా....

రోజా చేతులు నన్ను చుట్టేశాయి. నా ఆలోచనల్లోంచి అన్నీ తప్పుకొని రోజా మాత్రమే ఆక్రమించుకుంటున్న దశలో గదిలో ఫోన్ మ్రోగింది.

ఫోన్ నేనే అందుకొని—"హాలో!" అన్నాను.

"నమస్తే సర్! గదిలో రమణ్ కుమార్ అనేవారున్నారా?"

"నేనే రమణ్ కుమార్ ని!" అన్నాను.

"మీకోసం ఎవరో వచ్చారు. పంపేదా?"

తెల్లబోయాను. నాకోసం ఎవరొస్తారిక్కడికి? ఎవరికీ తెలియకుండా రహస్యంగా నేనిక్కడికొచ్చాను.

"ఎవరు?"

"ఒక యువతి. పేరు రాధ!"

ఉలిక్కిపడ్డాను. అంటే రాధ నన్ననుసరించి వచ్చిందా? అలా అనుసరించి రావడానికి కారణమేమిటి? ఆమె నన్ననుమానించిందా?

నిన్న రాత్రి నేను ఆలస్యంగా రావడం గురించి ఆమె ఆరాతీయకపోయినా ప్రత్యేకంగా మాట్లాడింది. ఆమెకు అసలు విషయం తెలిసిపోయిందా?

మౌత్ పీస్ మూసి—"రాధ వచ్చింది—నాకోసం" అన్నాను రోజాతో.

రోజా పెద్దగా ఆశ్చర్యపడ్డట్టు కనబడలేదు—"చాలా రాంగ్ టైములో వచ్చింది—" అంది నిట్టూర్చి.

"ఇప్పుడు నే నేం చేయాలి?"

"ఏదో అనుమానంమీదే ఆమె యిక్కడకొచ్చింది. రూంలోకి రమ్మనమంటే నే మంచిది...." అంది రోజా.

"వస్తే....?" అన్నాననుమానంగా.

"భయపడకు. గురుబక్ష్ సింగ్ వుండనే వున్నాడు.." అని నవ్విందామె.

నేను వెంటనే — "ఆమెను పైకి పంపండి—" అన్నాను.

3

రాధ, నేను ఇంట్లో సోఫాల్లో ఒకరికొకరు ఎదురుగా కూర్చున్నాం.

నేను భయం భయంగా వున్నప్పటికీ పైకి మేకపోతు

గాంభీర్యాన్ని నటిస్తున్నాను. ఆమె ఇప్పుడేమంటుందో?

"చాలా సారీ అండీ!" అంది రాధ.

"ఎందుకు?"

"అర్జంటుగా నాన్న పిల్చుకుని రమ్మన్నాడని మీకు చెప్పాను. అది నిజంకాదు—" అంది రాధ.

"మరేమిటి నిజం?" అన్నాను అసహనంగా.

"మీ నడవడిక బాగుండడంలేదనీ, చెడుతిరుగుళ్ళు తిరుగుతున్నారనీ—ముఖ్యంగా మీకు స్త్రీ అంటే బలహీనత వున్నదనీ నాన్నకు అనుమానం వచ్చింది...."

నేను తెల్లబోయాను. రాధ అంత సూటిగా విషయం మాట్లాడుతుందనుకోలేదు నేను.

"అనుమానం మీ నాన్నకేనా—నీక్కూడానా?"

"ఊరికే మాటవరసకి అనుమానం అన్నాను కానీ—నాన్నకు మీ గురించి తెలిసింది—అని చెప్పాలి...." అంది రాధ.

నా ప్రశ్నకందులోనే బదులుంది. అనుమానం రాధకూ వుందన్నమాట!

"అంటే నువ్వూ నన్ననుమానిస్తున్నావన్నమాట!" అన్నాను.

"మా నాన్న సంగతి మీకు తెలియదు. ఆయనకీ ఊరినిండా అనుచరులున్నారు. ఎలాంటివాడి గురించైనా ఆయన క్షణాలమీద సమాచారం రాబట్టగలడు...."

"అంటే?"

"ఆయన మీ గురించి ఏదైనా అన్నాడంటే అందుకు తగ్గ సాక్ష్యాలున్నాయన్న మాటే కదా!"

నేను వెంటనే ఏమీ చెప్పకుండా కాసేపాగి—"ఇంతకీ నువ్వనేదేమిటి?" అన్నాను. అసహనాన్ని

ప్రకటిద్దామనుకున్నాను కానీ భయమే నా గొంతులో ధ్వనించింది.

"నే నెప్పుడూ ఒకటే అంటాను. నేను మిమ్మల్ని నమ్ముతాను. కానీ మీరుకూడా నన్ను నమ్మాలి...." అంది రాధ.

ఆమె వివరించి చెబుతూంటే నేనే ఆశ్చర్యంగా విన్నాను.

స్త్రీ అంటే బలహీనత వుండడం మగాడికి సహజం. అవతిలి స్త్రీకి అన్యాయం జరుగనంతకాలం, ఆరోగ్యానికి భంగం లేనంతకాలం ఆ తప్పును భర్తను క్షమించే సహృదయత రాధకుంది. భర్త మరో స్త్రీని వివాహమాడేందుకామె వ్యతిరేకి. కానీ భర్త మరో స్త్రీతో అనుభవాన్ని పంచుకుంటే ఆమె తప్పుపట్టదు.

"నన్ను నమ్ముమంటూవా?" అన్నాను.

"మోసం నాకు నచ్చదు. అత్యాచారం నాకు కిట్టదు. నన్ను నిర్లక్ష్యంచేస్తే నేను బాధపడతాను. ఈ మూడూ లేనప్పుడు మీరు చేసింది తప్పయినా నేను పట్టించుకోను. కానీ మీరు నానుంచి రహస్యందాస్తే నేను బాధపడతాను...." అంది రాధ.

"నేనిప్పుడు రహస్యం దాస్తున్నానని నీ కనుమానం వచ్చిందా?"

"మీ రెప్పుడెప్పుడెక్కడెక్కడికి వెడుతున్నదీ నాన్నకు తెలుస్తూనే వుంటుంది. అది నాన్నద్వారా తెలుసుకోవడం నా కిష్టముండదు. నాన్న చెప్పడానికి ముందే మీ విషయం నేను నాన్నకు చెప్పగలగాలి. అందుకని మీ కార్యక్రమం ముందే నాకు చెబుతూండండి...."

"అందువల్ల ప్రయోజనం?"

"ఇందాకా — ఉడ్‌లాండ్స్ హోటల్లోలా మరోసారి మిమ్మల్ని డిస్టర్బ్ చేయాల్సిన అవసరముండదు ...." అంది రాధ.

రాధ చాలా తెలివైనది. ఆమె నన్ను క్రమంగా తన గుప్పిట్లో యిరికించుకోవాలని చూస్తోంది. ఎక్కడా నా మనసుకు నొప్పి తగలకుండా నన్ను నిందిస్తోంది. తను క్షమిస్తానని హామీ యిస్తూ నా తప్పు తెలుసుకుందుకు ప్రయత్నిస్తోంది.

ఇదంతా పెద్ద ట్రాప్ అని నాకు తెలుసు.

"రాధా! బిజినెస్ వ్యవహారాలన్నీ అందరికీ చెప్పలేను. నువ్వు నన్ను నమ్ముతున్నందుకు చాలా థాంక్స్! నా ప్రవర్తన నీ నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా వుండదని హామీ యిస్తున్నాను—" అన్నాను.

అప్పుడు రాధ మనోహరంగా నవ్వింది — "నేనేం చెప్పినా మీ మంచికోసమే చెప్పాను. అటుపైన మీ ఇష్టం. మీ యిష్టం మీకు హానిచేయవచ్చు. అదొక్కటే ఆలోచించుకోండి...."

ఆమె మాటలు నవ్వంత మనోహరంగా లేవు. మాటల్లో హెచ్చరిక వుంది.

నేను మళ్ళీ ఉడ్‌లాండ్స్ హోటలుకే బయల్దేరాను. రాధ మంచిది కావచ్చు. కానీ ఆమెకోసం రోజాను వదులుకోగలిగిన మంచితనం నాకు లేదు.

4

సాయంత్రం నాలుగు గంటలకు నాకు ఫోన్ వచ్చింది.

"రాత్రి ఏడు గంటలకు — దొడ్డి గుమ్మాన — రా —" ముక్తసరిగా చెప్పింది రామావతారం.

ఫోన్‌లో మాట్లాడినా ఆమె గొంతు చాలా సెక్సీగా

వుంటుంది. ఒక అమ్మాయికి రామావతారం అన్న పేరే చిత్రమనుకుంటే ఆమె గొంతులో పెద్ద ధ్వనించడం మరింత విచిత్రం.

ఈ మాట చెబితే రామావతారానికి నచ్చదు. ఆమె పవిత్రతకు ప్రాధాన్యతనిస్తుంది. పురుషులకు దూరంగా వుండడానికి ప్రయత్నిస్తుంది. అటువంటి యువతి నన్ను ప్రేమించడమొక పెద్ద విశేషం.

నిజానికి నేనామె గొంతు విని ఆకర్షితుడినయ్యాను. ఆమెతో పరిచయానికి ప్రయత్నించాను. స్వల్పకాలంలోనే ఆమె నాతో ప్రేమలో పడింది. రోజా నాతో తిరిగేటప్పుడు వుపయోగించిన తెలివితేటలన్నీ ఉపయోగించాను. అందువల్ల మా పరిచయం గురించి మా యిద్దరికీ తప్ప ఎవరికీ తెలియదు.

రామావతారం క్రమంగా నన్ను పెళ్ళి గురించి నొక్కించసాగింది. అదెంతవరకూ దారితీసిందంటే చివరికామెను వదుల్చుకోవడం నాకు తప్పనిసరి అనిపించింది. అప్పుడామెకు నా గురించి నిజం చెప్పేశాను.

అప్పుడు రామావతారం నన్ను తిట్టని తిట్టులేదు.

నేను నవ్వి—"నేను మోసగాడినే. ఒప్పుకుంటాను. కానీ నీ గొంతులో పెద్ద ధ్వనిస్తుంది. ఆ ధ్వని నన్ను పెడదారి తొక్కించింది. నన్ను మన్నించగలిగితే మన్నించు—" అని చెప్పాను.

రామావతారం అప్పుడు తలిదండ్రులు చూసిన సంబంధానికి ఒప్పుకొని పెళ్ళిచేసుకుంది. ఆమె భర్త నాకంటే అందంగా వుంటాడు. ఏదో చిన్న ఉద్యోగం చేసుకుంటున్నాడు. అతడిని చూస్తూంటే నాకు చాలా అసూయగానే వుండేది. అతడి లాలనలో రామావతారం నన్ను

పూర్తిగా మర్చిపోయింది.

వివాహమైనా రోజా నన్ను మర్చిపోలేదు. రామావతారం కూడా రోజాలాగే నన్ను మరిచిపోకుండా నా కోసం పరితపించాలి.

ఒకసారి ఆమెతో ఈ విషయం చెప్పాను.

"నా భర్త పురుషోత్తముడు. నీ పరిచయం నా దురదృష్టం. ఓ పీడ కల. ఇప్పుడు నువ్వది గుర్తుచేయకు—" అంది రామావతారం.

ఆమె అలా మాట్లాడుతూంటే—గొంతులో సెక్స్ ధ్వనిస్తోంది నాకు. ఆమెను దగ్గరగా తీసుకొని—"ఇంకా తిట్టు—" అనాలనిపించింది నాకు.

రామావతారం తిడుతూంటే నాకు కోపంరాదు. మామూలుగాకంటే — ఆవేశంలోనే ఆమె గొంతు ఎక్కువ బాగుంటుంది. నన్ను రెచ్చగొడుతుంది.

"నీ భర్త ఎంతటి పురుషోత్తముడో చూస్తాను. మన పూర్వ పరిచయం గురించి అతడికి చెబుతాను...." అన్నాను.

రామావతారం భయపడుతూనే-"ఆయన నీ మాటలు నమ్మరు...." అంది.

ఎంతటి పురుషోత్తముడికైనా భార్యననుమానించక తప్పదీ కర్మభూమిలో. అప్పటికే ఆమె భయపడుతున్నదని గ్రహించి—ఆమె భయాన్ని మరికాస్త పెంచడానికి నా దగ్గరున్న సాక్ష్యాలు చెప్పాను.

తిరుగులేని సాక్ష్యాలవి! అవేమిటో ఆమెకూ నాకూ మాత్రమే తెలుసు. ఆమె భర్తను నమ్మించడానికవి అద్భుతంగా పనిచేస్తాయని ఆమెకు తెలుసు.

"వద్దు. నా కాపురం పాడుచెయ్యొద్దు...." అందామె.

"నీ కాపురం పాడు చేసే ఉద్దేశం నాకూ లేదు. ఎటొచ్చీ నువ్వు నన్ను సంతోష పెట్టాలి—"

"ఎలా?"

"ఎలాగో నీకు తెలుసు...."

నా ఉద్దేశ్యం విని ఆమె వణికిపోయింది—"పెళ్ళికి ముందు ఏదో జరిగిపోయింది. ఇప్పుడు నువ్విలాగనడం భావ్యం కాదు—"

నేను నవ్వి—"గతం నీ భవిష్యత్తును బాధించకూడదంటే గతాన్ని గతంలాగే కొనసాగనీ—" అన్నాను.

"అందుకు నేను మానసికంగా సిద్ధంగా లేను—" అందామె.

"గడువు కావాలా?"

ఏమనుకుందో—"ఇస్తావా?" అంది.

"నన్ను వదుల్చుకోవడం కోసం గడువడిగితే దారుణంగా నీపై పగతీర్చుకుంటాను. లేనిపక్షంలో కొంత గడువివ్వగలను.. "

"నన్ను వదిలి పెట్టలేవా?"

"వదిలి పెడతాను—డబ్బిస్తే!"

"ఎంత కాలం?"

"అడిగినప్పుడల్లా అయిదు వేలు. ఎన్నిసార్లడుగుతానో నాకే తెలియదు ఆలోచించుకో!"

ఆమె ఆర్థికస్థితి నాకు తెలుసు. నా షరతు వినగానే ఆమె "నీకు డబ్బెందుకు?" అంది.

"డబ్బడిగే ఆడవాళ్ళకివ్వడానికి...."

రామావతారం మాట్లాడకుండా ఆలోచనలో పడి పోయింది.

నేనామెకు నచ్చచెప్పడం ప్రారంభించాను—"రామావతారం! నువ్వు నాకు కొత్త కాదు. నేను నీకు కొత్త కాదు. మనం కలుసుకుంటే అది కొత్త తప్పూకాదు. నా ప్రోద్బలంమీద తప్పనిసరి పరిస్థితుల్లో యిరుక్కున్నావు బట్టి అది నీ తప్పూకాదు. ఇందులో నీ భర్తకు జరిగే అన్యాయమేమీలేదు. నువ్వనుకునే అన్యాయం నీ భర్తకెప్పుడో జరిగింది. ఇప్పుడు నీ భర్తకు నిజం తెలియడమే అన్యాయం. అది జరక్కుండా కాపాడుకో...."

ఆ తర్వాత రామావతారం నన్ను గడువే అడగలేదు. నా మనసెంతో సంతోషించింది. తర్వాత ఆమెకు చెప్పాను—"నెలకు రెండుసార్లైనా నువ్వు నన్ను ఆహ్వానించాలి. నా ఫోన్ నంబరిస్తాను. ఫోన్లో నాకు కబురు చెప్పు. నువ్వే నన్నాహ్వానించడంవల్ల నీకిబ్బంది వుండదు. నీ యింట్లో అనుకూల పరిస్థితులు నీకే బాగా తెలుస్తాయి కదా—"

అటుపైన ఆమెను హెచ్చరించానుకూడా. ఏ నెలలో ఆహ్వానం మర్చిపోయినా ఆమె భర్తకు నిజం తెలుస్తుంది.

రామావతారం అన్నింటికీ ఒప్పుకుంది. అది అసహాయత అని నాకు తెలుసు. కానీ ఆడదాని అసహాయతకు జాలి పడకపోవడంలో నే మగాడి సుఖం వుంది. ఆ విషయం బాగా తెలిసినవాళ్ళలో నేనూ ఒకడిని.

ఈ నెలలో అప్పుడే మూడు వారాలు గడిచాయి. ఇంకా రామావతారంనుంచి ఫోన్ రాలేదు. పిట్టకు బెదిరింపు డోసింకోటివ్వాలా అని ఆలోచిస్తున్నాను.

కానీ ఫోన్ వచ్చేసింది.

రాత్రి ఏడుగంటలకు....

రామావతారం యింటి దొడ్డిదారి ఒక సందులోకి

వుంటుంది. ఎవరికీ తెలియకుండా ఆమె యింటికి వెళ్ళడం పెద్ద కష్టం కాదు.

నా ఆలోచనలను రామావతారం ఆక్రమించేసింది.

ఆడవాళ్ళు రకరకాలు.

నన్ను ప్రేమించి వేరే వివాహం చేసుకునికూడా అప్పుడప్పుడు నాకోసం వచ్చే రోజా....

నన్ను ప్రేమించి వివాహం చేసుకొని నా వ్యక్తిగత జీవితం జోలికి రానని మాటిమాటికీ మాటయిచ్చే రాధ....

నేను ప్రేమించాననుకుని మోసపోయి నన్ను ప్రేమించి మోసం గ్రహించేక వేరే వివాహం చేసుకొని నన్ను ద్వేషించాలనుకుంటూ అది సాధ్యపడక నన్ను ప్రేమిస్తూండడం తప్పనిసరి అయిన రామావతారం....

ముగ్గురిలోనూ నాకు రాధ మనసంటే యిష్టం. రోజా శరీరమంటే యిష్టం. స్త్రీగా యిష్టపడేది మాత్రం రామావతారాన్ని!

అందుకే — హోటల్ ఉడ్‌లాండ్స్‌లో రోజా వున్నదని తెలిసినప్పటికీ — నాకుత్సాహం పుట్టించింది రామావతారం పిలుపు.

ఆఫీసులోనే వుండిపోయాను ఆరింటివరకూ.

అప్పుడు నాకు ఫోన్ వచ్చింది. ఆలస్యానికి రాధ ఫోన్ చేసిందా అనుకున్నాను. కానీ తీరాచూస్తే రోజా!

"అర్జంటుగా రా!" అది రోజా పిలుపు.

ఆఫీసునుంచి తిన్నగా రోజా గదికి వెళ్ళాను.

"ఏమిటి అర్జంటు?"

"నేను వచ్చింది నీ కోసం...."

"సాయంత్రాలు రాలేనని చెప్పానుగా...."

రోజా నా వంక దీనంగా చూసి — "ఇలాగైతే

నాకిక్కడ బోర్ కొడుతుంది. రాలేనంటే కుదరదు....”
అంది.

రోజాకు నాతో కలిసి సినిమా చూడాలనుంది. అందుకని కాసెట్ తెప్పించి వుంచింది. ఆ రూంలో వీడియో సౌకర్యముంది.

సినిమా పేరు శంకరాభరణం.

“నేను చూసేశాను....” అన్నాను.

“నేనూ చూసేశాను. కానీ మనం చూడలేదుగా....”
అంది రోజా.

ఆ సినిమా ఆమెకెంతగానో నచ్చింది. నాతో కలిసి ఆ సినిమా చూడాలన్నదామె కోరిక.

కాదనలేకపోయాను.

ఏడుగంటలకు నాకు రామావతారం ఆహ్వానముంది. అది నేను వదులుకోలేనిది.

అప్పుడు టైము ఆరున్నరయింది.

ఏదో వంక పెట్టి తప్పించుకోవాలనుకున్నాను.

రోజా కాసెట్ పెట్టింది. సినిమా ప్రారంభమైంది.

అప్పుడామె నాకు దగ్గరగా జరిగింది. తన తలను నా భుజంపై వాల్చింది. రెండో చేతిని నా రెండో భుజంపై వేసింది.

కాలేజీ రోజుల్లో బాక్స్ టికెట్ తీసుకొని మేమిద్దరం అలా సినిమా చూసేవాళ్ళం. థియేటర్ కు ముందామె వచ్చేది. కాసేపటికి నేను వెళ్ళేవాణ్ని. సినిమా చూడ్డం అయేక ముందు నేను వెళ్ళిపోయేవాణ్ని. తర్వాత ఆమె వచ్చేది.

ఆ రోజుల్లో కాబట్టి అలా సరిపోయింది.

ఇప్పుడలా కుదరదు.

ఇద్దరూ వివాహితులం. అందుకే ఆమె సర్దార్జీ వేషంలో గురు భక్ష్ సింగ్ పేరుతో ఈ హోటల్లో మకాం పెట్టింది. సర్దార్జీని కలుసుకునే నెపంతో నేనామెను కలుసుకుం టున్నాను. ఏ సరదాలైనా ఈ హోటల్ గదికే పరిమితం.

నేనామె నడుంచుట్టూ చేయి వేశాను.

సినిమా నడుస్తోంది.

కథలో అర్థముంది. అందముంది. నడకలో ఆకర్షణుంది. వేగముంది. అందుకే చూడ్డంలో విసుగుండదు.

ఒకరినొకరు పొదివిపట్టుకొని మేమా సినిమా చూస్తున్నాం. అయితే గతింలోలా యిద్దరు ప్రేమికుల్లాకాక పసిపాపల్లా ఆ చిత్రం చూశాం.

చిత్రం చూస్తూన్నంతసేపూ నవరసాల అనుభూతి కలిగింది.

నేను యేడుగంటలనీ, రామావతారాన్నీ మరిచి పోయాను.

సినిమా అయిపోయింది.

"నీతో ఈ సినిమా చూస్తూ గొప్ప అనుభూతి పొందాను..." అంది రోజా.

నాకూ అలాగే అనిపించింది. కానీ....

సినిమా చూస్తూ మేము కబుర్లు చెప్పుకోలేదు. ఒకరి నొకరు పలకరించుకోలేదు. మేము సినిమానే చూశాం. అయితే నన్ను కదిలించిన దృశ్యం ఆమెనూ కదిలించిందనీ, నన్నానందపరిచిన విశేషం ఆమెనూ ఆనందపరిచిందనీ— అనిపించే భావన ఒక పెద్ద విశేషం!

"ప్రేమికులు కలిసి చూడదగ్గ సినిమా యిది!" అన్నాను.

ఈ భావన ఆ చిత్ర నిర్మాతకూ, దర్శకుడికీ వచ్చి వుండదు. ప్రేమికులేం కర్మ—ఆబాలగోపాలమూ చూసి ఆనందించిన చిత్రమిది!

"నీకు తీరిక లేకపోయినా—నాకోసం నాతో యింత సేపూ గడిపావు. చాలా సంతోషం. థాంక్స్!" అంది రోజా.

"నేనే నీకు థాంక్స్ చెప్పాలి—" అందామనుకున్నాను కానీ నాకు తీరికెందుకు లేదో స్ఫురించింది. రామావతారం గుర్తొచ్చింది.

చటుక్కున లేచాను.

టైము తొమ్మిది కావస్తోంది. త్వరపడితే అక్కణ్నించి పావుగంటలో రామావతారం యిల్లు చేరుకోగలను.

ఇంకా నాకు అవకాశముంటుంది.

ఎందుకంటే రామావతారానికి నేను ముందే చెప్పాను.

"నేనేదో వేశ్య వద్దకు వెడుతున్నానన్న భావం నాకు కలక్కూడదు. ఇద్దరు ప్రేమికుల్లా గడపాలి మనం. కులాసాగా కబుర్లు చెప్పుకుంటాం. చదివిన కథలు మననం చేసుకుంటాం. కలిసి టిఫినో, భోజనమో చేస్తాం. తీరుబడిగా మనింట్లో మనం గడుపుతున్నట్లుండాలి. అంటే మనం కలుసుకున్నప్పుడల్లా మూడు నాలుగు గంటలసేపైనా మనం నిర్భయంగా, నిస్సంకోచంగా వుండగలగాలి...."

అంటే యిప్పుడుకూడా రామావతారం ఇంట్లో ఏకాంతంగానే వుంటుందన్న మాట....

"మరి నేను వెళ్ళాలి రోజా!" అన్నాను.

రోజా ప్రేమతో నాకు వీడ్కోలు చెప్పి—"తెల్ల

వారేసరికి మళ్ళీ నువ్వు నా రూం తలుపు తట్టాలి—”
అంది.

“దట్స్ మై ప్లెజర్!” అని అక్కణ్నించి బయల్దేరాను.

దొరికిన ఆటో వెంటనే ఎక్కేశాను. గమ్యస్థానంలో దిగాను.

నా జాగ్రత్తలు నేను తీసుకుంటూ ఎవరికంటా పడకుండానే రామావతారం యింటి దొడ్డిగుమ్మం చేరుకున్నాను.

తలుపులు దగ్గరగా వేసివున్నాయి. తోయగానే తెరుచుకున్నాయి.

రామావతారం ఉంటున్నది చిన్న బంగళా యిల్లు. అదామె భర్త బాబాయిది. అంగుళల్ల చవగ్గా వచ్చింది వాళ్ళకి. ఇంటి చుట్టూ ప్రహరీగోడ. ఇంటి ముందూ వెనకాకూడా పెద్ద పెద్ద ఫలవృక్షాలున్నాయి. ఇప్పుడు నేను చుట్టూ తిరిగి ముందుకు వెళ్ళి ముఖద్వారంవద్ద తలుపు కొట్టినా గోడమీద వాళ్ళకు కనబడను. అయినా నేను రాజమార్గా నెన్నుకోలేదు. మరొకరెవ్వరూ రాడానికి వీలులేకుండా దొడ్డితలుపు వేసేశాను.

ఇంటి వెనుక తలుపుకూడా తీసే వుంది.

నెమ్మదిగా యింట్లో ప్రవేశించాను.

ఇంట్లో ఎక్కడా అలికిడి లేదు. రామావతారం ఇంట్లో ఉండేవుండాలి. కానీ యెక్కడా మసులుతున్న జాడ లేదు.

ఇల్లంతా చీకటిగాకూడా వుంది.

ఒక్క నిముషం తటపటాయించి తడుముకుంటూ దీపం వేశాను. నేనున్న గది ప్రకాశవంతమయింది.

కళ్ళు నులుముకున్నాను.

అక్కడున్న నిశ్శబ్దం నన్ను కలవరపరుస్తోంది. అయినా రామావతారంమీద నాకున్న మోజు నన్ను ముందుకే నడిపించింది.

పడక గదిముందాగాను. గది తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. బయటనుంచి గడియపడి వుంది.

ఆ గడియ చూడగానే నాకు స్ఫురించింది.

నేలబారుగా వున్న ఆ గడియ మనం లాక్ చేయడం మరిచిపోయామంటే—తలుపులు దగ్గరగా వేసినప్పుడు నేలమీదకు పడిపోయే అవకాశముంది. అప్పుడు ఎవరైనా వచ్చి తలుపులుతీస్తే తప్ప గదిలో వున్నవాళ్ళు బందీకిందే లెక్క....

ఈ గడియలో ఇబ్బందిగా వుందని రామావతారం నాకు చెప్పింది. ఇంట్లో మేమిద్దరమే వున్నప్పటికీ ఎందుకైనా మంచిదని గదితలుపులు వేయబోయాను. అప్పుడామె నన్నోసారి ఆ గడియ గురించి హెచ్చరించింది.

మేమిద్దరం లోపలుండగా ఆ గడియ పడిపోయిందంటే ఇంకేమైనా వుందా?

ఆ గడియ యే విధంగా పడుతుందో బయటనుంచి ఆమె చూపించింది.

ఇప్పుడా గడియను చూడగానే అసలు విషయం నాకు స్ఫురించింది.

హడావుడిలో తలుపు, గడియపడిపోయి రామావతారం పడకగది లోపల వుండిపోయుంటుంది. ఏడింటికల్లా నేను వస్తానని ఎదురుచూసి వుంటుంది. ఎప్పటికీ నేను రాలేదు. ఇంట్లో ఇంకెవ్వరూ లేరు. విసుగుతో కళ్ళుమూసుకుంటే నిద్రపట్టేసి వుంటుంది.

అందుకే యిల్లంతా నిశ్శబ్దంగా వుంది.

నేను నెమ్మదిగా గడియతీసి తలుపు తోశాను.

లోపలకూడా చీకటి. అవతల గదిలో నేను వేసిన దీపపు వెలుతురీ గదిలోకి యే మాత్రమూ ఉపయోగపడ్డం లేదు. రామావతారం నిద్రపట్టడంకోసం లైటార్పేసి వుంటుంది.

నేను గదిలో అడుగుపెట్టి స్విచ్ బోర్డుకోసం తడమసాగాను.

ఇంతలో గదిలో అడుగుల చప్పుడు వినిపించింది. చెవులు రిక్కించాను.

రామావతారం పాదాల సవ్వడి మెత్తగా, మనోహరంగా వుంటుంది.

ఇప్పుడు నేను విన్నది ఆమె పాదాల చప్పుడు కాదు. అసలు నేనలాంటి చప్పుడు విన్నానా అన్న భ్రమకూడా కలుగుతోంది. ఎందుకంటే కొద్ది క్షణాలు మాత్రమే విన్నానా చప్పుడు....

స్విచ్ తలుపుకు పక్కనే వుండాలి. వెంటనే చేతికి దొరకలేదు. ఈలోగా నా చేతికి తగిలిందో యేమో గది తలుపు దగ్గరగా వేసుకుంది. గడియపడిన చప్పుడూ అయింది.

నాకు పై ప్రాణాలు పైనే పోయినట్లనిపించింది.

ఇప్పుడు రామావతారంకూడా ఈ గదిలో నేవుంటే....

మేమిద్దరం....ఒకే గదిలో....ఎవరో వచ్చి విడిపించేంతవరకూ బందీలుగా వుండిపోతాం. నా పరువుకు, రామావతారం జీవితానికీ తట్టుకోలేని దెబ్బ తగుల్తుంది.

ఈ విషయం రాధవరకూ వెడుతుంది. అప్పుడామె నన్ను క్షమిస్తుందా? ఎందుకో ఆమె నన్ను తప్పక క్షమి

న్నుందనే అనిపించింది.

మళ్ళీ తడుముకుంటూ మొత్తంమీద స్విచ్ పట్టుకున్నాను. ఒక్కసారి గదిలో ట్యూబ్ లైటు వెలిగింది.

చీకటికి అలవాటుపడ్డ నా కళ్ళు వెలుగును భరించలేకపోయాయి. కళ్ళు నులుముకుని ముందుకు చూశాను.

మంచంమీద యెవరో దుప్పటి కప్పుకొని నిద్రపోతున్నారు.

వాతావరణంలో చలిలేదు. అటువంటి సమయంలో దుప్పటి కప్పుకొని ఉక్కపోవాలని యెవరనుకుంటారు?

మంచంమీది వ్యక్తి రామావతార మేనని నేనూహించగలను. ఆమె కప్పుకుని పడుకుందంటే—ఆరోగ్యంకానీ దెబ్బతినలేదుకదా...

తినబోతూ కూర రుచి అడగనేల?

గదిలో నేను, రామావతారం....

గది తలుపులు గడియపడ్డాయి. బయటినుంచి ఎవరైనా వస్తే తప్ప నేను బయట పడలేను. అలాగని యిప్పటి సమయం వృధా చేసుకోవడ మెందుకు?

నేను లోపల్నుంచికూడా గడియ వేసి మంచం దగ్గరకు నడిచి నెమ్మదిగా "రామూ!" అన్నాను.

దుప్పటిలోని మనిషి నుంచి సమాధానంలేదు.

దుప్పటి కాస్త లాగాను.

రామావతారం!

ప్రశాంతంగా వుంది ముఖం.

"ఏయ్—యింత మొద్దు నిద్ర రేమిటి? లే.... లే...."
అన్నాను.

ఆమె బదులివ్వలేదు. పూర్తిగా దుప్పటి లాగేశాను. ఏదో అనబోయి ఉలిక్కిపడ్డాను.

రామావతారం గుండెల్లోకి దిగి వుంది—ఒక బాకు! పిడిమాత్రం కనపడుతోంది. చుట్టూ రక్తం గడ్డకట్టి వుంది.

అంటే?

రామావతారం చచ్చిపోయింది. చచ్చిపోలేదు. చంపబడింది. అంటే హత్య ...ఆమెనెవరో హత్య చేశారు.

గదిలో నేను, రామావతారం! రామావతారం హత్య చేయబడింది. నేనా గదిలో బందీని. ఎవరైనా వచ్చి తలుపులు తీస్తే తప్ప నాకు మోక్షంలేదు. అప్పుడు మాత్రం ...

నా కళ్ళు జలదరించింది.

రామావతారం హత్యకు నేను సంజాయిషీ యిచ్చుకోవాలి. అందరూ నేనే హంతకుడినంటే కాదని ఋజువు చేసుకోవాలి.

ఇప్పుడు రామావతారాన్ని చూస్తూంటే నాకు భయం కేస్తోంది. నా భవిష్యత్తంతా ఆమె హత్యతో ముడిపడి వుంది.

ఎవరామెను హత్య చేశారు? ఎందుకు చేశారు?

మళ్ళీ నా బుర్ర పనిచేస్తోంది. గదిలో అడుగు పెట్టినాక—నేను విన్న అడుగుల చప్పుడు భ్రమకాదు.

ఎవరో రామావతారంపై పగబట్టారు. ఆమెను చంపేశారు. అప్పుడు తెలిసింది — గది తలుపు బయటనుంచే గడియపడిందని. హంతకుడు గదిలో కూర్చుని అవకాశం కోసం యెదురుచూస్తున్నాడు. నేను తలుపుతీయగానే తను గదిలోంచి బయటపడి-బయటనుంచి తలుపు గడియ వేశాడు.

ఇప్పుడు నాకు స్ఫురిస్తోంది. నేను తలుపు గడియ తీసి

నపుడు జాగ్రత్తగా పక్కన పెట్టాను. అది మళ్ళీ క్రిందకు పడే అవకాశం లేదు. ఎవరో కావాలని నన్ను గదిలో బంధించారు.

నన్ను బంధించిన వాళ్ళెవరో. హత్య కేసులో నన్నిరికించడానికి ప్రయత్నిస్తారు. కాసేపట్లో యిక్కడికి పోలీసులు రావడం తథ్యం.

పోలీసులకు నేనేం చెప్పాలి? అసలు నేనిక్కడ యెందుకున్నానంటే ఏం చెప్పాలి?

మొదటిసారిగా తప్పు చేసినందుకు నన్ను నేను నిందించుకున్నాను. నిందించుకుని లాభం లేదుకదా....గదిలోంచి బయటపడడానికి ఏమైనా వీలుంటుందేమోనని చూశాను. నేను వేసిన తలుపు గడియ తీసేశాను. తలుపులు మళ్ళీ మళ్ళీ లాగిచూశాను. లాభంలేదు. తలుపు రావడంలేదు. బయటపడడానికింకో దారిలేదు.

నా ప్రయత్నాల్లో నేనుండనే వున్నాను. ఈలోగా గది తలుపులు తెరుచుకున్నాయి. అనుకున్నట్లే పోలీసులు వచ్చారు.

"ఇన్‌స్పెక్టర్! ఈ గదిలో నేనుండడం నా దురదృష్టం. ఈ హత్యతో నాకెలాంటి సంబంధమూ లేదు. అంతా నేను నిజమే చెబుతాను. మీకు సహకరిస్తాను. నన్ను హంతకుడిగా భావించవద్దు...." అంటూ నే యిన్‌స్పెక్టర్‌కి లొంగిపోయాను.

5

రామావతారం తళుకు బెళుకులతో నన్ను లొంగదీసుకుంది. నాకు స్త్రీలంటే బలహీనత వుంది. అది ఆధారంగా చేసుకుని ఆమె నానుంచి డబ్బు గుంజుతూ తన అవసరాలు గడుపుకునేది.

వివాహమైనా ఆమె నన్ను వదిలిపెట్టలేదు. నా భార్యకు మా పూర్వ పరిచయం గురించి చెబుతానని బెదిరించి తన యింటికి రప్పించుకుంటుంది. నా దగ్గర డబ్బూ గుంజుతుంది. తన మోజు తీర్చుకుంటుంది.

ఆ రోజు నన్నామె ఏడింటికి పిలిచింది. తొమ్మిదిదాకా నేను వెళ్ళలేకపోయాను. అప్పుడు వెడితే హంతకుడు నన్ను తెలివిగా గదిలో బంధీ చేశాడు.

ఇదీ నేను పోలీసులకు చెప్పిన కథ. నా కథను కొంత వరకూ పోలీసులు నమ్మారు. రామావతారం అడక్కపోయినా నేనామెకు కొంత డబ్బిస్తూ వుండేవాడిని. ఆ డబ్బునామె బ్యాంకులో వేసుకునేది. నేనిచ్చానన్న మొత్తాలూ, తేదీలూ—ఆమె పాస్ బుక్ తేదీలతో సరిపోయాయి.

నేను చెప్పిన కథలో నిజముంది. ఎటొచ్చీ వంచన చేస్తున్నవారు తారుమారయ్యారు. చనిపోయిన మనిషిపై నింద వేయడం తప్పని నాకు తెలుసు. కానీ నేను చేస్తున్న తప్పు నా బ్రతుకును నిలబెడుతుంది. చనిపోయిన వారికోసం బ్రతికున్నవారు జీవితాన్ని త్యాగం చేయడం బుద్ధిహీనత అనిపించుకుంటుంది.

నా కథకు ప్రచారం వచ్చింది. మామగారింట్లోనూ, రాధకూ కూడా నేను పోలీసు కస్టడీలో వున్న విషయం తెలిసింది. మామగారు మండిపడి నా ముఖం కూడా చూడనన్నారుట. రాధ నన్ను బెయిలుమీద విడిపించుకునేందుకు వచ్చింది.

"మొత్తంమీద నా మంచితనానికి పరీక్ష పెడుతున్నారన్నమాట!" అంది రాధ మొదటిసారిగా నన్ను చూడ్డానికి వచ్చినపుడు.

నేను సిగ్గుతో తల వంచుకున్నాను.

"రామావతారం గురించి ముందే నాకెందుకు చెప్ప లేదు?"

"చివరివరకూ నీనుంచి దాచగలననుకున్నాను...."

రాధ నిట్టూర్చి—"హత్య మీరు చేయలేదుకదూ!" అంది.

"నేను చేయగలనని నమ్ముతున్నావా?" అన్నాడు దీనంగా.

"నేనుండగా మరో స్త్రీతో సంబంధం పెట్టుకో గలరనీ నమ్మలేదు నేను...."

ఝళ్ళున కొట్టినట్లయింది నాకు — "నేను నిజంగా హత్య చేయలేదు...."

"అది న్యాయవాదులు చూసుకుంటారు. నేను చేయ గలిగిందల్లా బెయిల్ మీద విడిపించి మిమ్మల్నింటికి తీసుకుని వెళ్ళడం!" అంది రాధ.

"థాంక్స్ రాధా!" అన్నాను.

"నా డ్యూటీ నేను చేస్తున్నాను. థాంక్సెందుకు?"

నేను మాట్లాడలేదు.

మేము ఇంటికి వెళ్లాం.

రెండు రాత్రులూ—ఒక పగలూ తర్వాతే మళ్ళీ ఇల్లు చేరాను నేను. ఆ యిల్లు నాది. నాదంటూ ఒక ఇల్లుంచు కుని నాది కాని ఒక యింటికి వెళ్ళడంవల్ల నేనిప్పుడు హత్య కేసులో అనుమానితుణ్ని.

"నాకు మిమ్మల్ని చూస్తే చాలా జాలిగా వుంది—" అంది రాధ.

"ఇప్పుడు నీకు నామీద జాలేస్తోందా?" ఆశ్చర్యం గానూ, ఆనందంగానూ అడిగాను.

"పొరుగింటి పుల్లకూర రుచి అన్న సామెత ఒక్క మగవాళ్ళ విషయంలోనే నిజమనుకున్నాను. ఎందుకంటే నేను వయసులో వున్న అందమైన స్త్రీని. వివాహానికి ముందు మగవాళ్ళను చూసే అప్పుడప్పుడు రకరకాల ఊహాలు పుట్టేవి. వివాహమైనాక మనసంతా మీరే నిండి పోయారు. కలలోకూడా పరాయి పురుషుడిపై తప్పుడు ఊహరాదు నాకు. నిత్యం యెందరో సినీ హీరోలను, ప్రపంచ శ్రేణి ఆటగాళ్ళను—టీవీల్లోనో, సినిమాల్లోనో, సభల్లోనో చూస్తూంటాను. కానీ పొరపాటునకూడా వాళ్ళలో ఎవరినీ మీ స్థానంలో ఊహించుకున్న సంద ర్భాలు నాకు లేవు. అది పాతివ్రత్యమని నేను భావించడంలేదు. స్త్రీకి సహజమని అనుకుంటున్నాను. స్త్రీ జీవితంలో స్థిరత్వాన్ని కోరుతుంది. రక్షణను కోరుతుంది. ఆమె కోర్కెలు ఒక వలయానికి చుట్టూ తిరుగుతాయి. పురుషుడి విషయంలో అలా కాదని నేను విన్నాను...." రాధ ఆగింది.

ఆమె చెప్పబోయేదేమిటో నాకర్థం కాలేదు కానీ నేనిప్పుడు అపరాధిని. రాధ దృష్టిలోనే కాదు, న్యాయస్థానం దృష్టిలోకూడా!

రాధ మళ్ళీ ప్రారంభించింది — "ఈ లోకంలో పురుషుడికంటే స్త్రీలూ వుంటారని రామావతారం నిరూపించింది. ఆమె వలలో మీరు పడడం మీ దురదృష్టం. అందుకే నాకు మీరంటే జాలిగా వుంది."

"థాంక్స్ రాధా—నీనుంచైనా నాకు రవంత జాలి దొరికింది...."

రాధ నా మాటలు వినే మూడ్‌లో లేదు. ఆమె యింకా చెప్పుకుపోతోంది—"ఈ భూమ్మీద స్త్రీ పుట్టక

ఎందుకు? తన వాళ్ళను అర్థం చేసుకుని లాలించడానికీ—తప్పులు చేయబోయే వాళ్ళను వారించడానికీ....! అందుకే భగవంతుడామెను ప్రేమమయిని చేశాడు. అటువంటి స్త్రీ జాతికి మాయని మచ్చగా నిలిచిన రామావతారం వంటి ఆడదానికీ లోకంలో జీవించే అర్హత లేదు. మీరామెను హత్యచేసి వుంటే నేనానందించి వుండేదాన్ని...."

నేను ఇబ్బందిగా ఫీలయ్యాను. రామావతారాన్ని రాధ తప్పుపట్టి తిడుతోంది. రామావతారంలో తప్పులేదనీ ఆ తప్పు నాదనీ నాకు తెలుసు కాబట్టి ఆమె తిట్లన్నీ నాకు తగులుతున్నాయి.

"నేనామెను చంపలేదు—" అన్నాను.

"అసలేం జరిగిందో మొత్తమంతా మీరు నిజమే చెప్పారుకదూ!"

"రాధా! నిజమొక్కటే యిప్పుడు నన్ను రక్షించగలదని నాకు తెలుసును. అబద్ధం చెప్పలేను...."

"మీకోసం ప్రత్యేకంగా డిటెక్టివ్ కిల్లర్‌ని రప్పిస్తున్నాను. ఆయన మిమ్మల్ని తప్పకుండా రక్షించగలడు...."

"డిటెక్టివ్ కిల్లర్?!" అన్నాను ఆశ్చర్యంగా.

నేనాయన పేరు విన్నాను. ఆయన వయసు ముప్పై దాటింది. పెళ్ళి చేసుకోలేదు. తన జీవితాన్ని నేర పరిశోధనకే అంకితం చేశాననీ, వివాహామందుకు ప్రతిబంధకమనీ అంటూ డాయన.

ఆయనలో వచ్చిన ఇబ్బంది ఏమిటంటే—పరిశోధనకు దిగేక మొత్తం వివరాలన్నీ లాగేస్తాడు. తను కనుగొన్న వివరాలన్నీ పత్రికలకు తెలియజేస్తాడు. ఏ కేసుకైనా

ఆయనవ్నాహ్వానించే ముందు పెద్దమనుషులన్నవారు ఆలోచించుకోవాలి.

"డిటెక్టివ్ కిల్లర్ పేరు వినలేదా?" అంది రాధ.

"విన్నాను. కానీ ఈ కేసులో డిటెక్టివ్ వెంకన్నను పిలవాల్సింది...." అన్నాను సంకోచిస్తూ నే.

"ఎందుకని?"

"ఆయన ఆమాకీలన్నీ రహస్యంగా వుంటాయి. నేరస్థుల రహస్యాలను దాచడంలో ఆయనకాయనే సాటి!"

రాధ నవ్వి—"మీ గురించిన పూర్తి రహస్యాలు తెలుసుకోవాలన్నది నా కోరిక. అందుకే కిల్లర్ని పిలిచాను—" అంది. నా ముఖం ఆదోలాగై పోవడం చూసి.

"మీరు హత్యచేయనప్పుడు కిల్లర్ తప్ప యింకెవ్వరూ మిమ్మల్ని రక్షించలేరు. మీ గురించి యెటువంటి నిజం బైటపడినా నేను భరించగలను. ఇంకా మీ కెందుకు భయం?" అందామె మళ్ళీ.

తప్పుచేసినవాడు భయపడక తప్పదు గదా....

కిల్లర్ బైటపెడితే తప్ప నా తప్పులన్నీ రాధ ముందు ఒప్పుకోదల్చుకోలేదు.

6

"అయాం కిల్లర్. కిల్లరాఫ్ లైస్. కిల్లరాఫ్ ఫాల్స్ హుడ్. కిల్లరాఫ్ క్రిమినల్స్..." అంటూ చేయి చాచాడతడు.

నేను భయం భయంగా చేయి జాపి—"అయాం నా టే క్రిమినల్. నమ్ముతారా?" అన్నాను.

"నమ్మను—" అన్నాడు కిల్లర్—"ఈ ప్రపంచంలో

నేరస్థుడు కానివాడంటూ వుండడుకాబట్టి—"

"అయితే అందర్నీ చంపేస్తారా?"

"నా క్రతువు తెరువుకు అవసరమైనంతమందిని, నా జీవన పరిమితి వీలిచ్చినంతమందిని...." అని నవ్వాడు కిల్లర్.

అతణ్ని మంచిచేసుకోవడం మంచిదనిపించింది—"మీ తెలుగు చాలా గొప్పగా వుంది. అదే మీ మాతృభాషా?" అన్నాను.

"నా తల్లి భారతమాత. ఆమె భాషలన్నీ నా మాతృభాషలే...."

ఏమనాలో తెలియలేదు.

కిల్లర్ నన్ను పరీక్షగా చూడ్డం మొదలుపెట్టాడు. అతడి చూపులు నన్ను గుచ్చుతున్నాయి. నాకిబ్బందిగా అనిపించి తలవంచుకున్నాను.

"మీ కథనం ప్రకారం హత్యజరిగిన గదిలో మీకంటే ముందెవరో మసిలారు. పోలీసులకలాంటి ఆధారాలు ముందు దొరకలేదు. నేను రంగంలో దిగగానే గదంతా శోధించి కొన్ని కొత్త వేలిముద్రలు సంపాదించాను..." అన్నాడు కిల్లర్.

కిల్లర్ నిజంగా చురుకైనవాడు.

పడకగది నానుకునే బాత్రూముంది. బాత్రూములో కాస్త పైనుంచి వెంటిలేటరుంది. వెంటిలేటరుకు ఇనప చువ్వలున్నాయి. ఆ విషయం పైదాకా వెడితే కానీ తెలియదు. నాకంటే ముందెవరైనా ఆ గదిలో చిక్కుపడివుంటే తప్పించుకుందుకక్కడ ప్రయత్నం చేస్తాడు.

అక్కడ రెండు జతల వేలిముద్రలు దొరికాయి. ఒకటి నావి.

"అంటే ఆవే హంతకుడివయుండాలి...." అన్నాను.

కిల్లర్ తల అడ్డంగా ఊపి—"హంతకుడెవరో ఇంకా తెలియలేదు. అప్పుడే ఏమీ చెప్పలేము. గదిలో మీరు కాక యింకో వ్యక్తి అక్కణ్ణించి బయటపడాలని ప్రయత్నం చేసినట్లు తెలుస్తుంది. ఆ వ్యక్తి ఎవరన్నది తెలుసుకోవాలి...." అన్నాను.

"ఎలా తెలుస్తుంది?" భయంగానూ ఆత్రుతగానూ అడిగాను.

"అది తర్వాత తెలుసుకుందురుగాని. హత్య సుమారు ఏడుగంటల ప్రాంతాల జరిగింది. మీరు తొమ్మిది గంటలకు అక్కడికి వెళ్ళానంటున్నారు. నిజానిజాలు తెలుసుకుందుకు గురుబక్ష్‌సింగ్ సాయపడాలి. కానీ గురుబక్ష్‌సింగ్ పరారీలో వున్నాడు. అతడి గురించిన ఆచూకీ తెలిస్తే తప్ప మీ ఎలిబీకి అర్థంలేదు—" అన్నాడు కిల్లర్.

పోలీసులు అరెస్టు చేయగానే నేను తొమ్మిదిదాకా గురుబక్ష్‌సింగ్‌తో వున్నానని చెప్పాను. పోలీసులు వుడ్‌లాండ్స్ హోటలుకు ఫోన్ చేశారు. గురుబక్ష్‌సింగ్ వున్నాడు. నా మాటలు నిజమేనని చెప్పి—పోలీసులు వస్తావంటే రమ్మన్నాడు.

పోలీసులు వెళ్ళేసరికి అతను లేడు. అతడు బయటకు వెళ్ళడం యెవరూ చూడలేదు. అంటే తెలివిగా పారి పోయేడన్నమాట! గదిలో అతడి సూట్‌కేసుంది. అందులో అతడి బట్టలు మాత్రం వున్నాయి. అతడు తిరిగివస్తాడని పోలీసులు రెండుమూడు రోజులు యెదురు చూశారు రాలేదు.

గురుబక్ష్‌సింగ్ ఎందుకు పరారీ అయ్యాడు? ఈ ప్రశ్న

ఒక్కటే చాలు—నన్ను నేరస్థుడిగా నిరూపించడానికి!

అసలు నిజం చెబితే రోజా జీవితం నాశనమవుతుంది. చెప్పకపోతే నాకు జీవితమే వుండదు. ఇంతవరకూ గురుబక్ష్ సింగ్ గురించి నేను సరైన సమాచారమివ్వలేదు. మా కంపెనీకి సంబంధించిన వ్యవహారంమీద రహస్యంగా మాట్లాడాలని వచ్చాడని చెప్పాను.

నేను చెప్పిన అబద్ధాలు పోలీసులు నమ్మారు. గురుబక్ష్ సింగ్ పోలీసుల కళ్ళబడడానికిష్టపడడం లేదంటే అతడివద్ద దొంగసరుకేదో ఉండివుండాలి. ఏమిటా దొంగ సరుకు? అది హోటల్నించి ఎలా తప్పించాడు?

పోలీసుల ఆలోచన ఈ దారిలో నడుస్తున్నాయి.

కిల్లర్ వచ్చి రెండ్రోజులయింది. నన్ను మాత్రం అతడీ రోజువరకూ కలుసుకోలేదు కానీ పోలీసులనుంచి మొత్తం సమాచారమంతా రాబట్టి పరిశోధనలో వున్నాడు.

"గురుబక్ష్ సింగ్ గురించి నేనేం చెప్పగలను?" అన్నాను.

"గురుబక్ష్ సింగ్ వదిలివెళ్ళిన సూట్ కేసులో అతడి బట్టలున్నాయి. వాటిని పరీక్షించి చూశాను. అతడు చాలా నాజూకైన మనిషనిపించింది. సర్దార్జీలలో అంత నాజూకైనవారు అరుదు. అందులోనూ అతడు అయిదడుగులమీద ఒక అంగుళం మించి పొడవుండడని హోటల్లో వారందరూ అంటున్నారు...." అని ఆగాడు కిల్లర్.

నేను తడబడ్డాను. అతడిదంతా నాకెందుకు చెబుతున్నట్లు?

కిల్లర్ యింకా వివరించాడు.

గదిలో బాగా చనువుగా మసిలిన వారిద్దరే యిద్దరు. ఇద్దరిలో ఒకరు నేనేనని వేలిముద్రలు తెలియబరు

స్తున్నాయి. రెండో వ్యక్తి గురుబక్ష్ సింగు అయుండాలి.

"అది సహజమేకదా—" అన్నాను.

"సహజం కాని విశేషమొకటుంది—" అన్నాడు కిల్లర్.

"ఏమిటది?" కుతూహలంగా అడిగాను.

"గురుబక్ష్ సింగ్ సూట్ కేసులో మంచి పరిమళం. అదే పరిమళం స్నానాల గదిలో, మంచంమీదా కూడా వుంది. దీని అర్థం అతడు బాగా పెర్ ఫ్యూమ్స్ వాడతాడని. అవి అతడికి ప్రాణమై వుండాలి. వెళ్ళేటప్పుడు కూడా తీసుకుని వెళ్ళాడు...."

"ఇందులో అసహజమేముంది?"

"అసహజమేమిటంటే ఆ పెర్ ఫ్యూమ్స్ పురుషులు వాడేవి కాదు...."

నేనులిక్కిపడి—"పెర్ ఫ్యూమ్స్‌కు ఆడా మగా వుంటుందా?" అన్నాను.

"మగాళ్ళలోనూ బొట్టు, కాటుక పెట్టుకునే వారుండవచ్చు. కానీ అవి ఆడవారి సొత్తుగానే భావించడం జరుగుతుంది...." అని కిల్లర్ ఒక్క నిమిషమాగి— "మంచంమీద మీవి, గురుబక్ష్ సింగ్ వి— వేలిముద్రలు ఎన్నో చోట్ల కలగాపులగంగా వున్నాయి. మీరు, అతడు కలిసి స్త్రీ పురుషుల్లా మసిలారనడాని కక్కడ అదే సాక్ష్యం. ఎటొచ్చీ గురుబక్ష్ సింగ్ స్త్రీయా, పురుషుడా అన్నది మీరు చెప్పాలి—" అన్నాడు.

"వెధవ వేలిముద్రలు....ఎంత పని చేశాయి?" అనుకున్నాను. నాకు వాటికి తడారిపోయినట్లయింది.

"ఆ గదిలో మూడో వ్యక్తి మసలలేదు. ఒక స్త్రీ ఆ గదిలో అడుగుపెట్టిందనడానికి సాక్షులెవరూ లేరు.

గురుబక్ష్‌సింగ్ ఆడదేనా అయుండాలి. లేదా మీరిద్దరూ సెక్స్ పెర్వర్ట్స్ అయుండాలి. రెండింట్లో ఏది నిజం?" అన్నాడు కిల్లర్.

నాకు గొంతు పెగల్లేదు.

"సమాధానం గురించి మీరాలోచిస్తున్నట్టున్నారు. నిజం చెప్పాలా, అబద్ధం చెప్పాలా అన్న ఆలోచన అది! మీరు నిజం చెప్పడానికి సహకరించే ఓ సమాచారం చెబుతాను. అక్కడ తలదిండు క్రింద రెండు పొడవాటి వెంట్రుకలు దొరికాయి. వాటిని కెమికల్ ఎనాలిసిస్‌కు పంపడం జరిగింది. వాటిలోని భాస్వరం ఎమౌంట్‌నిబట్టి అవి స్త్రీ వెంట్రుకలని తేలింది...."

"అబద్ధం—గురుబక్ష్‌సింగ్ ఆడది కాదు...."

కిల్లర్ శాంతంగా — "అయిదడుగుల ఒక అంగుళం ఎత్తయిన నాజూకైన శరీరంతో హోటల్ ఉడ్‌లాండ్స్ గదిలో మంచంమీద ఏకాంతంగా చనువుగా గడిపారన్న వార్త పత్రికలకెక్కితే—హంతకుడిగా ఉరికంబమెక్కే ముందే అవమానం మిమ్మల్ని చంపేస్తుంది...."

నేను మాట్లాడలేదు.

"గురుబక్ష్‌సింగ్ స్త్రీ అనడంలో సందేహంలేదు. పోలీసులు ఫోన్ చేయగానే ఆమె తన స్త్రీ వేషాన్ని ధరించి పురుష దుస్తులు సూట్‌కేసులో వదిలి—మిగతావన్నీ ఏ చేతిసంచిలోనో వేసుకొని వెళ్ళిపోయుంటుంది. ఆ సమయంలో భుజానికి వ్రేలాడే చేతిసంచీతో ఓ అందమైన యువతి హోటల్లోంచి బయటకు వెళ్ళడం కొందరు చూశారు. ఆమే గురుబక్ష్‌సింగ్ అయుంటుందని యెవరూ ఊహించలేదు. కానీ గదిలో ఆమె పాదాల గుర్తులున్నాయి. ఒక్క పైకోటు మినహాయిస్తే ఆమె

ధరించిన పాంటు, షర్టు స్త్రీలవని తెలుస్తూనేవున్నాయి.
మీరామె వివరాలు చెబితే మీకు నేను హంతకుడి వివరాలు చెబుతాను. నా ఊహ నిజమయితే తప్ప అది బయట పెట్టను. నా ఊహ నిజమో కాదో తెలుసుకోవాలంటే — మీరు గురుబక్ష్ సింగ్ వివరాలు చెప్పాలి...."

అప్పుడు నేను రోజా వివరాలు చెప్పకుండా ఆమె గురించి చెప్పాను.

"అంటే నేననుకున్నది నిజమేనన్నమాట!" అన్నాడు కిల్లర్.

"ఏమనుకున్నారు మీరు?"

"మీ శీలం మంచిది కాదని...."

నేను దెబ్బతిని — "హంతకుడి గురించి చెబుతానన్నారు!" అన్నాను.

"ఒక యువతి వివాహమైనాక మీకోసం భర్తను మోసం చేసి — మారువేషంలో యింత సాహసం చేసి వస్తుందంటే నమ్మడం కష్టం. మీరామెను దేనితో బ్లాక్ మెయిల్ చేసి లొంగదీసుకొని వుండాలి...."

"కాలేజీ రోజుల్నించీ ఆమే నా వెంటబడింది. నేనామె జోలికి వెళ్ళలేదు—...." అన్నాను ఉక్రోషంగా.

"అంటే అప్పుడుగానీ యిప్పుడుగానీ ఆమె మిమ్మల్ని రేప్ చేసిందా?"

ఈ ప్రశ్నకు తెల్లబోయి — "అంటే?" అన్నాను.

"ఆమె ప్రేమకు మీ సహకారంకూడా వున్నదని నా భావం ..." అని ఆగి — "ఇంత చెప్పి ఆమె పేరు, చిరునామా మాకివ్వలేరా?" అన్నాడు కిల్లర్.

"ఆమె కన్యాయం చేయలేను...." అన్నాను.

"ఇట్సాలెైట్ — ఈమాత్రం చెప్పారు చాలు...."
అని వెళ్ళిపోయాడు కిల్లర్.

7

"ఇది చూడండి—" అంది రాధ.

అది ఆ రోజు దినపత్రిక. అందులో రెండో పేజీలో రోజా ఫోటో వుంది.

రామావతారం హత్యకేసులో గురుబక్షసింగ్ వ్యవహారానికి సంబంధించిన కొత్త నిజాన్ని కనుగొని డిటెక్టివ్ కిల్లర్ పత్రికలవారికి తెలియబరిచాడు. అతడి పరిశోధనా వివరాలందులో వున్నాయి.

అతడు నేను చదువుతున్న కాలేజీకి వెళ్ళి అక్కడ పరిశోధన కొనసాగించాడు. నా టైములో నాకు పరిచయస్థులైన ఆడపిల్లలెందరో, వారిలో భాగ్యవంతులెందరో అందులో చదువుకొనసాగుతూండగానే యెవరికి వివాహమయిందో కనుక్కునేసరికి రోజా పేరు బయటపడింది. అతడామె చిరునామా సాధించడమేగాక కలుసుకున్నాక నిజం చెప్పకపోతే ఆమెను బలవంతంగా మా ఊరు తీసుకొచ్చి హోటల్ ఉడ్‌లాండ్స్‌లోని వారందరికీ ఆమెను గురుబక్షసింగ్ వేషంలో చూపుతానని బెదిరించాడు. ఆమె నిజంచెప్పేసి రహస్యం కాపాడమని వేడుకుంది.

అదిప్పుడు పేపర్లో వచ్చింది.

"మీరు నాతో చాలా అబద్ధాలు చెప్పారు...."
అంది రాధ నిట్టూర్చి.

నేనేదో అనేలోగా కిల్లర్ మా యింటికి వచ్చాడు. నన్ను చూస్తూనే — "మీరు చెప్పకపోయినా రోజా గురించి తెలుసుకున్నాను. కావాలనుకుంటే రోజా

గురించి మీ చేత నే చెప్పించేవాణ్ని. కానీ నా శక్తి సామర్థ్యాలు మీకు తెలియడం మంచిదనిపించి అలా చేశాను. ఇప్పుడు మీరు ఈ కేసులో మాకు చెప్పకుండా దాచిపెట్టిన మొత్తం రహస్యాలన్నీ బయటపెట్టి సహకరించడం మీకే మంచిది ....” అన్నాడు.

“నేను దాచిపెట్టింది ఒకేఒక్క రహస్యం. అది మీరు కనుక్కోవడమే కాక బట్టబయలు కూడా చేశారు” అన్నాను.

“మరి రహస్యం కనుక్కొనేదెందుకు?”

“రోజా జీవితం ఏమవుతుందో ఆలోచించారా?”

“జీవితాన్ని నిలబెట్టుకోవడం — రహస్యాన్ని దాచడంలో కాదు. రహస్యం అవసరం లేకపోవడంలో వుంది—” అని—“రోజా చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకుంది. అందుకు మీ ప్రోత్సాహమూ వుంది కాబట్టి ఆమెపై జాలివుంటే మీరు మీ భార్యను వదిలి రోజాతోనే కాపురం పెట్టండి—” అన్నాడు కిల్లర్.

“అలా ఎలా కుదురుతుంది?”

“హత్య చేసినవాడు ఉరికంబానికి సిద్ధపడక తప్పదు” అని— “రామావతారం పడకగది నానుకుని వున్న బాత్రూంలో మీవికాక మరొకరి వేలిముద్రలున్నాయన్నానుగదా— అవి యెవరివో తెలుసుకున్నాను....” అన్నాడు కిల్లర్.

“ఎవరివి?” అంది రాధ.

“అతడి పేరు శంభునాథ్. నిరుద్యోగి. ఆ వీధి మొత్తానికి తీరుబడివున్న మగాళ్ళు నలుగురున్నారు. ఎంక్వయిరీకి వెళ్ళినట్లు వెళ్ళి ఆ నలుగురివీ వేలిముద్రలు సంపాదించాను. అందులో శంభునాథ్ వేలిముద్రలు

మాళ్యాకలసినవని తేలిపోయింది....”

“అసలతడా వీధిలోనే వుంటాడని యెలా ఊహించారు?”

“రామావతారానికి మగాళ్ళ పిచ్చి వుందని తెలిసింది కదా. ఆమె తన వలను విసురుతూనే ఉండివుండాలి. ఆమె ఎవరిమీద వలను విసురుతుందీ అంటే చెప్పడం కష్టం. పెళ్ళికాని వాళ్ళనూ, ఏ పనీలేకుండా తీరుబడిగా వున్న వాళ్ళనూ అయితే ఆమెకు సేఫ్. ఆ కోణంలో ఆలోచించి అది ఫలించకపోతే మరో ఆలోచన చేద్దామనుకున్నాను. అదృష్టవశాత్తూ — ఫస్టు బెట్టే క్లిక్కయింది—” అన్నాడు కిల్లర్.

“ఈ కిల్లర్ దేవాంతకుడు —” అనుకున్నాను. నేనిచ్చిన తప్పుడు సమాచారంతో అతడు సరైన మనిషిని పట్టుకున్నాడు. అతడి విజయం కాకతాళీయమా లేక రామావతారం నిజంగానే బరితెగించిందా?—“అంటే ఆ రామావతారం నన్నేకాక చాలామందిని సాధిస్తోందన్న మాట....” అన్నాను.

“దాన్ని సాధించడమనే అంటారు. అవగా సహకరించే వాళ్ళను సాధించడం....” అని నవ్వాడు కిల్లర్.

“శంభునాథ్ నేరం ఒప్పుకున్నాడా?” అంది రాధ.

“ఒప్పుకునేందుకతడు నేరంచేస్తే కదా!” అన్నాడు కిల్లర్.

“మరెవరు చేశారు?”

“మీ శ్రీవారే చెప్పాలి....”

“నిజంగా నాకేమీ తెలియదు....” అన్నాను. కిల్లర్ వ్యవహారంచూస్తే—అతడు నేను హంతకుడినని నాచేతే ఒప్పించేలాగున్నాడు.

"మీకు తెలియనిది చెప్పొద్దు. తెలిసిందే చెప్పండి.."

"ఏం చెప్పాలి?"

కిల్లర్ వివరించసాగాడు.

రామావతారానికి పెళ్ళికి పూర్వం రమణ్ కుమార్ అనే యువకుడితో పరిచయముంది. రమణ్ కుమార్ ఆమెను మోసం చేశాడు. ఆమెకు పెళ్ళయినా అతడామెను వదలకుండా బెదిరించి అనుభవిస్తున్నాడు. రామావతారం అందుకు మానసికంగా సిద్ధపడిలేదు. కానీ తన కాపురం నిలబెట్టుకోవడంకోసం ఆమె యిష్టంలేని పనిచేస్తోంది. అయితే యే రహస్యమైనా యెన్నాళ్ళో దాగదు.

రామావతారం ఇంటికి రమణ్ కుమార్ వచ్చిపోతున్న విషయం శంభునాథ్ గమనించాడు. వాళ్ళమీద నిఘా వేశాడు. వాళ్ళ సంభాషణను వినడమేకాక పాకెట్ కాసెట్టెరికార్డర్లో రికార్డు చేశాడు. అటుపైనుంచి శంభునాథ్ రామావతారం వెంటబడ్డాడు. తనకు లొంగకపోతే ఆమె భర్తకు నిజం చెప్పేస్తానన్నాడు.

రామావతారం లొంగలేదు. తనలాంటిదాన్ని కాదని వేడుకుంది. రమణ్ కుమార్ని తనకో పీడలా దాపురించాడని వాపోయింది. తన అసహాయత నాధారంగా తీసుకొని వేశ్యగా మార్చవద్దని కోరింది. శంభునాథ్ కరగలేదు.

చివరికామె ఒకరోజున అతణ్ని సాయంత్రం రమ్మనమని చెప్పింది. అతడు వెళ్ళాడు. గదిలో ఆమె పడుకుని వుంది—దుప్పటి కప్పుకొని. దుప్పటి తీసిచూస్తే ఆమె శవముంది!

శంభునాథ్ భయపడ్డాడు. బయటకు వద్దామంటే ఎవరో తలుపులు వేసి బయటినుంచి గడియ పెట్టారు.

"అప్పుడు మీరు వెళ్లారు. శంభునాథ్ తప్పించుకోవడమే కాక పోలీసులకు ఫోన్ చేశాడు కూడా...." అన్నాడు కిల్లర్.

నేను కిల్లర్ చెప్పేది వింటున్నాను. అంటే ఇతడు మొత్తం నా గురించిన కథంతా తెలుసుకున్నాడన్న మాట!

"ఇప్పుడింతకీ మీరు నాకు చేయాల్సిన సాయమల్లా రామావతారం పూర్వ పరిచయమున్న ప్రేమికుడు రమణ్ కుమార్ మీరేనని! మీరు కాదన్నా శంభునాథ్ టేప్ రికార్డరు ఔనని ఋజువు చేస్తుంది. అవునంటే హంతకుడు మీరు కాదని తేలిపోతుంది...."

"హంతకుడెవరు?"

"ముందు మీరు చెప్పండి. రామావతారం విషయంలో మీరు గతంలో చెప్పిందంతా అబద్ధం. ఆమెను మీరు బ్లాక్ మెయిల్ చేసి ఇష్టంలేని పనికి ఒప్పించారు. అవునా?"

"అవును—...." అన్నాను తలవంచుకుని.

"రామావతారాన్ని ఆమె భర్త చంపాడు. శంభునాథ్ తనింటికి రాకపోకలు చేస్తూండడం గమనించి నిఘా వేసి అతడో రోజున మొత్తం కథ తెలుసుకొని— భార్యను నిలదీసి పూర్తి నిజం తెలుసుకుని—"వాళ్ళిద్దర్నీ రాత్రి ఏడుగంటలకు రమ్మని చెప్పు. అందరిముందూ ఈ సమస్యకు పరిష్కారం చెబుతాను—" అన్నాడు భార్యతో.

ఆ రోజతడాఫీసుకు వెళ్ళినట్టే వెళ్ళి దొడ్డిదారిన తిరిగి వచ్చాడు. చివరిసారిగా భార్యతో అన్ని సుఖాలూ పొందాడు. తర్వాత ఆమెను ఒక్కసారి కళ్ళు మూసుకోమన్నాడు. బాకుతో గుండెల్లో పొడిచి—అరవకుండా

నోరు మూశాడు. శంభునాథ్‌ని గదిలో యిరికించి తను వెళ్ళిపోయాడు.

అన్నాళ్ళూ మామూలుగా వుంటూ ఉన్నట్లుండి భార్య పోయిన రోజునే ఊరి ప్రయాణం పెట్టుకోవడం చాలా రోజులవరకూ తిరిగిరాకపోవడం తనమీద అనుమానానికి దారితీస్తుందని గ్రహించలేకపోయాడు. ఎందుకంటే అతడు ప్రొఫెషనల్ మర్డరర్ కాదు. ఆవేశం అతణ్ణి హత్యకు పురిగొల్పింది. హత్యచేశాక అతడు పశ్చాత్తాపపడ్డాడు. తిరిగి రాగానే నేనూ, పోలీసులూ ప్రశ్నలు వేసి దబాయించేసరికి నిజం ఒప్పుకొని యేడుస్తూ కూర్చున్నాడు. ఈ కేసులోంచే మీరు బయటపడ్డారు—" అన్నాడు కిల్లర్.

"థాంక్స్!" అన్నాను అప్రయత్నంగా. కానీ ఎందుకో నాకు సంతోషంగాలేదు. రాధవైపు చూశాను. ఆమె అప్పుడే లేచి లోపలకు వెళ్ళింది. తిరిగి వచ్చేసరికి ఆమె చేతిలో నోట్లకట్టలున్నాయి. వందరూపాయల నోట్లకట్టలు ... రెండు ....అంటే మొత్తం యిరవై వేలు...

కిల్లర్ డబ్బు అందుకుని — "థాంక్స్!" అన్నాడు.

"నా భర్తను రక్షించారు. మీ మేలు మరిచిపోలేను" అంది రాధ.

కిల్లర్ మాట్లాడలేదు. తమాషాగా నవ్వి ఓసారి చేయి వూపి వెళ్ళిపోయాడు.

రాధ నావైపు తిరిగింది. రమ్మన్నట్లు నావైపు చూసి ముందుకు నడిచింది. నేనామెననుసరించాను.

ఇద్దరం వెళ్ళి మంచంమీద పడుకున్నాం పక్క పక్కగా.

"తప్పుచేశాను రాధా — నన్ను క్ష మి ం చు...."

అన్నాను.

"మీరు నా నుంచి చాలా దాచారు...."

"ఇంకెప్పుడూ ఏమీ దాచను...."

"థాంక్స్ ఫర్ ది ప్రామిస్...." అంది రాధ. ఆమె మనోహరంగా నవ్వి—"ఒక్కసారి కళ్ళు మూసుకోండి" అంది.

ఆమెను సంతృప్తిపరచడంకోసం యేం చెప్పినా చేయాలి. కళ్ళుమూసుకున్నాను.

"కళ్ళు తెరవండి!" అంది రాధ.

తెరిచాను.

రాధ చేతులు వెనక్కి వున్నాయి. ఆమె ముఖం ఎర్రబడి వుంది.

"ఏ తప్పునైనా నేను క్షమించగలను. సహృదయంతో అర్థం చేసుకోగలను. పరిస్థితుల ప్రభావంవల్ల స్త్రీ అకర్షణకు లోనుకావడం పురుషుడికి సహజం. కానీ మీరు రామావతారం జీవితంతో ఆడుకున్నారు. ఆమెపై అత్యాచారం చేశారు. ఆమె హత్యకు మీరే కారణం. ఆమె భర్తను మీరే హంతకుణ్ణి చేశారు...."

"అవును రాధా! ఇంతవరకూ నేను చేసినవన్నీ తప్పులే! నేను రాక్షసుణ్ని. కానీ నువ్వు దేవతవి. నీ సాహచర్యంలో నా రాక్షసత్వం పోతుంది.." అన్నాను.

"నేను దేవతనే కావచ్చు—కానీ రాక్షసుడి సహచారిణిగా చాలాకాలం బ్రతికాను. అది నాలో రాక్షసత్వాన్ని నింపదా?" అంది రాధ.

ఆమె మాటల కర్థం తెలిసేలోగా—ఆమె రెండు చేతులూ ముందుకు వచ్చాయి. ఆ చేతుల్లో కత్తి వుంది. నేను కదిలేలోగా ఆ కత్తి నా గుండెల్లో దిగబడింది.

కెవ్వుమని అరిచాను.

"నిన్ను ప్రేమించడం జీవితంలో నేను చేసిన పెద్ద తప్పు. ఆ తప్పునిప్పుడే సవరించుకున్నాను. నాకిప్పుడే సంతోషంగా వుంది...." అంటూ నవ్వుతోంది రాధ.

నన్ను రక్షించడానికి కిల్లర్‌ని నియమించిన రాధ, మరో స్త్రీతో నేను అనుభవం పంచుకున్నా సహిస్తానన్న ప్రేమమూర్తి రాధ..తనే నన్ను అంతం చేసింది..

ఇంకా ఏమో అనిపించేలోగా నా కళ్ళు మూతలు పడ్డాయి.

—:అ యి పో యి ం ది:—